# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 21-06-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **మానవ జీవితంలో శక్తికి, చైతన్యానికి యోగా మూలమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు.**

2. **రాష్ట్రంలో యోగాసాధన కోసం శాశ్వత యోగా మందిరాలు నిర్మిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

3. **హైదరాబాద్ మెట్రో రైలు రెండవ దశ ప్రాజెక్టు పరిష్కారానికి సహకారం అందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.**

4. **రైతు కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ తెలిపారు.**

==========================

12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఈరోజు ప్రపంచ వ్యాప్తంగా ఘనంగా జరుగుతోంది. 2014 సెప్టెంబర్ 7వ తేదీన ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధి సభలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగిస్తూ... భారతీయుల అతి ప్రాచీనమైన, అమూల్యమైన విశిష్టమైన యోగా ప్రక్రియ గురించి తెలియచేశారు. యోగా ప్రక్రియ అంతర్జాతీయ స్థాయిలో జరిగేలా తోడ్పాటు అందించాలని ప్రధానమంత్రి ఆ సమావేశంలో చేసిన ప్రతిపాదన ఫలితంగానే జూన్ 21వ తేదీని ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ యోగా దినోత్సవంగా అధికారికంగా ప్రకటించింది. కేంద్ర ఆయూష్ మంత్రిత్వశాఖ పిలుపు మేరకు “ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా” అనే ఇతి వృత్తంతో ఈ ఏడాది యోగా దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా అన్ని నగరాలు, పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలలో ఘనంగా నిర్వహిస్తున్నారు.

-------------------------

12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కోల్‌కతాలోని రెడ్ రోడ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ యోగాసనాలు వేశారు. అనంతరం ప్రధానమంత్రి మాట్లాడుతూ, యోగా అనేది కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని, అన్ని వయస్సుల వారు సాధన చేయవచ్చని పేర్కొన్నారు. మానవ జీవితంలో శక్తికి, చైతన్యానికి యోగా మూలమని అన్నారు. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ‘ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా’ అనే ఇతివృత్తాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. వయస్సు పెరుగుతున్నప్పటికీ ఆరోగ్యంగా, ఉత్సాహంగా, చురుకుగా జీవించే మార్గాన్ని యోగా చూపిస్తుందని ప్రధానమంత్రి పేర్కొంటూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా యోగా వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. విజయవాడలోని ఇందిరా గాంధీ మునిసిపల్ స్టేడియంలో యోగాంధ్ర రాష్ట్రస్థాయి ప్రధాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొని ప్రముఖ యోగా గురువు బాబా రాందేవ్ మార్గదర్శకత్వంలో యోగాసనాలు వేశారు. అనంతరం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, ప్రతి ఇంటిలో యోగాను అభ్యసించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో యోగాసాధన కోసం శాశ్వత యోగా మందిరాలు నిర్మిస్తామని ముఖ్యమంత్రి తెలియజేస్తూ,

వాయిస్..30.. సెకన్లు

అలాగే రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో కూడా పెద్ద సంఖ్యలో ప్రజలు యోగా కార్యక్రమాల్లో పాల్గొని, అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు.

---------------------------

హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించిన అపరిష్కృత అంశాల పరిష్కారానికి సహకారం అందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డికి నిన్న లేఖ రాశారు. మెట్రో రెండవ దశ ప్రాజెక్టు, ఐఆర్ఎఫ్‌సీ ఫైనాన్సింగ్ అంశాలపై చర్చించాల్సిన అవసరం ఉందని లేఖలో పేర్కొన్నారు.. రైల్వే మంత్రితో సమావేశం ఏర్పాటు చేస్తే అవసరమైన పత్రాలతో హాజరవుతానని, సమావేశం వివరాలను తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగరానికి, రాష్ట్రానికి మెట్రో రైలు అత్యంత కీలకమైన మౌలిక వసతుల ప్రాజెక్టు అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కాగా ఈరోజు నుంచి ముఖ్యమంత్రి మూడు రోజులు ఢిల్లీలో పర్యటించనున్నారు.

---------------------------

'అన్నదాత సుఖీభవ -- పీఎం కిసాన్' పథకం కింద 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన తొలి విడత ఆర్థిక సాయాన్ని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ విడుదల చేశారు. కాకినాడలో నిర్వహించిన 'మన ఊరు మాటా మంతి' కార్యక్రమంలో ఆయన నిన్న పాల్గొని నిధులను విడుదల చేశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ రైతు కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఆర్థిక సవాళ్లు ఉన్నప్పటికీ ఇచ్చిన హామీ మేరకు వరుసగా రెండో ఏడాది రైతులకు నిధులు మంజూరు చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 47 లక్షల మంది రైతులకు తొలి విడతగా ఒక్కో రైతు కుటుంబానికి 7 వేల రూపాయల చొప్పున అందించనున్నామని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్ సమగ్ర అభివృద్ధి కోసం సుమారు 70 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన పనులు వేగంగా కొనసాగుతున్నాయని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ అమృత్ భారత్ రైల్వే స్టేషన్ పథకం కింద జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన నిన్న పరిశీలించారు. గతి శక్తి పథకం కింద పాదచారుల వంతెన నిర్మాణానికి 10 కోట్ల 22 లక్షల రూపాయలు కేటాయించినట్లు కేంద్రమంత్రి ఈ సందర్భంగా తెలియజేస్తూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

వివిధ రంగాల్లో తెలంగాణ ప్రభుత్వ శాఖలు అందిస్తున్న సేవలకు గానూ 2026 సంవత్సరానికి తెలంగాణ రాష్ట్రానికి మూడు ప్రతిష్ఠాత్మక స్కోచ్ పురస్కారాలు లభించాయి. డిజిటల్, ఈ-గవర్నెన్స్ అభివృద్ధికి చేసిన కృషికి తెలంగాణ ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్‌కు స్కోచ్ అవార్డు దక్కింది. అలాగే, టీజీఐపాస్ ద్వారా పారిశ్రామిక ప్రాజెక్టుల ఆమోదం, స్వీయ ధ్రువీకరణ వ్యవస్థ అమలులో అందించిన సేవలకు పరిశ్రమల కమిషనరేట్ పురస్కారం అందుకుంది. అంతరించిపోతున్న అరుదైన వన్యప్రాణుల సంరక్షణలో విశేష కృషి చేసినందుకు నెహ్రూ జంతు ప్రదర్శనశాలకు స్కోచ్ అవార్డు లభించింది. రాష్ట్రంలోని వివిధ శాఖలు సాధించిన ఈ విజయాలు తెలంగాణ పరిపాలనా సామర్థ్యానికి, అభివృద్ధి కార్యక్రమాలకు గుర్తింపుగా నిలిచాయని అధికారులు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని రైతులు సమస్యలతో రోడ్డెక్కుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని మాజీ మంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు విడదల రజిని ఆరోపించారు. పొగాకు, మామిడి, ఆక్వా, శెనగ, మొక్కజొన్న సహా పలు పంటలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని పేర్కొన్నారు. పల్నాడు జిల్లాలోని నాదెండ్ల, వినుకొండ ప్రాంతాల్లో రైతుల ఆత్మహత్యలు జరిగినప్పటికీ ముఖ్యమంత్రి ఆయా కుటుంబాలను పరామర్శించలేదని విమర్శించారు. రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని, వాటి నివారణకు రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు.

---------------------------

తూర్పు విదర్భ, దక్షిణ ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల మీదుగా ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతం వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లోని రాయలసీమ జిల్లాల్లో ఈ రోజు ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అలాగే రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

మరోవైపు తెలంగాణలో ఈరోజు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

=====================